# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 09-04-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

ముఖ్యాంశాలు

- రాష్ట్ర సొంత ఆదాయ లక్ష్యం 1,37,412 కోట్ల రూపాయలను నూరు శాతం ఆర్జించేలా అన్ని శాఖలు కృషి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
- తిరుపతి-కాట్పాడి మధ్య రైల్వే లైన్ డబ్లింగ్ కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రభుత్వం తాగునీటి సమస్యను పరిష్కరిస్తుందని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చెప్పారు.
- రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఒక సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నామని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు.
- నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రాగల 24 గంటల్లో క్రమంగా బలహీనపడే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

==================

రాష్ట్ర సొంత ఆదాయ వనరులు పెరిగితేనే అసలైన వృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈరోజు అమరావతిలోని సచివాలయంలో ఆదాయార్జన శాఖల అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో సంక్షేమం-అభివృద్ధి కార్యక్రమాలు కోసం సొంతంగా ఆదాయం పెంచుకునేందుకు, పన్నుల వసూళ్లు పెరిగేలా శాఖలన్నీ పనిచేయాలని అధికారులను ఆదేశించారు. మరిన్ని ఆదాయ మార్గాలను అన్వేషించడంతో పాటు, ఆదాయం తక్కువుగా నమోదవుతున్న శాఖలలో కారణాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని సూచించారు. పన్నుల చెల్లింపుల దగ్గర నుంచి రశీదులు, నోటీసులు జారీ ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లో జరగాలని ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న రాష్ట్ర సొంత ఆదాయ లక్ష్యం 1లక్షా 37వేల 412 కోట్ల రూపాయలను, నూరు శాతం ఆర్జించేలా అన్ని శాఖలు కృషి చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

==================

తిరుపతి-కాట్పాడి మధ్య ఉన్న సింగిల్ రైల్వే లైన్ సెక్షన్‌ను డబ్లింగ్ చేయడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామని సమాచార ప్రసార శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ పాత్రికేయులకు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు తిరుపతి జిల్లాలు, తమిళనాడులోని వెల్లూరు జిల్లా ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రయోజనం పొందుతాయని చెప్పారు. తిరుపతి-పాకాల-కాట్పాడి మధ్య 104 కిలోమీటర్ల మేర రూ.1,332 కోట్లరూపాయల అంచనా వ్యయంతో ఈ డబ్లింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడిస్తూ...

(వాయిస్ బైట్..40 సెకన్లు)-సెట్

ఇదిలా ఉండగా తిరుపతి-కాట్పాడి రైల్వే లైన్ డబ్లింగ్ కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంపై చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు హర్షం వ్యక్తం చేస్తూ చిత్తూరు అభివృద్ధికి ఇది ఒక కీలక అడుగు అని పేర్కొన్నారు.

===================

శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎవరైనా మాట్లాడినా, సామాజిక మాధ్యమాలలో పోస్టులు పెట్టినా వారిపై తగు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. విశాఖపట్నంలో ఈరోజు మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. రాప్తాడు పర్యటనలో ఉద్దేశపూర్వకంగానే గొడవలు సృష్టించేందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తుందన్నారు. రాప్తాడు నియోజకవర్గానికి వెళ్ళిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి 1100 మంది పోలీసులతో రక్షణ ఇచ్చామని వివరణ ఇచ్చారు. అనంతరం శ్రీకాకుళం వెళ్ళిన హోంమంత్రి ఎస్పీ కార్యాలయంలో.. విశాఖపట్నం పోలీస్ రేంజ్ పరిధిలో విజయనగరం.. పార్వతీపురం మన్యం... శ్రీకాకుళం జిల్లాల పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా.. రాష్ట్రంలో ప్రతి జిల్లాలో ఒక సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ ను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. ఒప్పంద ప్రాతిపదికన నియామకాలు చేపడతామని, పోస్టింగ్ అనంతరం సైబర్ క్రైమ్ నియంత్రణపై వారికి శిక్షణ ఇస్తామని హోంమంత్రి స్పష్టం చేశారు.

===================

జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రభుత్వం తాగునీటి సమస్యను పరిష్కరిస్తుందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా లక్ష్మణేశ్వరం గ్రామంలో జల్ జీవన్ మిషన్ కింద 2 కోట్ల 6 లక్షల 30 వేల రూపాయలతో ఏర్పాటు చేసిన తాగునీటి ప్రోజెక్టును భూపతిరాజు శ్రీనివాస వర్మ ఈరోజు ప్రారంభించారు. ఈసందర్భంగా  మాట్లాడుతూ, నరసాపురం మండలం సముద్రతీర ప్రాంతంలోని 9 గ్రామాల ప్రజలకు జల్ జీవన్ మిషన్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించనున్నామని తెలిపారు. 2019వ సంవత్సరంలో ప్రారంభించిన జల్ జీవన్ మిషన్ 2025తో పూర్తికానుందని, అయితే గత ప్రభుత్వం ఈ నిధులను వినియోగించుకోకపోవడంతో ఈ పథకాన్ని 2028 వరకు పొడిగించామని భూపతిరాజు శ్రీనివాస వర్మ వెల్లడిస్తూ...

(వాయిస్ బైట్..32 సెకన్లు)- పశ్చిమ గోదావరి జిల్లా

===================

విరామం

===================

ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన కార్డు ద్వారా దేశంలోని ఏ నెట్ వర్క్ ఆసుపత్రులలో నైనా వైద్య సేవలు పొందే అవకాశం ఉందని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కో-ఆర్డినేటర్ డాక్టర్ సుధీర్ కుమార్ తెలిపారు. ఈరోజు నెల్లూరులో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, 70సంవత్సరాలు పైబడిన వృద్ధులు ఈ కార్డు పొందేందుకు అర్హులని తెలిపారు.  కార్డు పొందిన వారి కుటుంబ సభ్యులు కూడా 5 లక్షల రూపాయల వరకూ వైద్య సేవలు పొందే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో ఇప్పటికే 1,064 మంది ఈ కార్డు కోసం పేర్లను నమోదు చేసుకున్నారని, మిగిలిన వారు కూడా ఈ కార్డు తీసుకోవాలని ఆయన కోరారు.

===================

నవోదయం 2.0 ద్వారా సారా రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను మారుస్తున్నామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లురవీంద్ర అన్నారు. తిరుపతిలో ఈరోజు జరిగిన ఎక్సైజ్ శాఖ అధికారుల రాష్ట్ర స్థాయి సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, 6 రాష్ట్రాల్లో అమలవుతున్న మద్యం పాలసీని అధ్యయనం చేసి నూతన పాలసీకి శ్రీకారం చుట్టామన్నారు. అత్యంత పారదర్శకంగా డిప్ నిర్వహించి మద్యం షాపుల్ని కేటాయించామని చెప్పారు. పారదర్శక లైసెన్స్ కేటాయింపు కారణంగా సుమారు 90వేల దరఖాస్తులు రాగా, వాటి నుండి 1800 కోట్ల రూపాయల ఆదాయం వచ్చిందని మంత్రి వెల్లడిస్తూ..

(వాయిస్ బైట్..32 సెకన్లు)- తిరుపతి

===================

విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమం శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఈరోజు పార్వతీపురం మన్యం జిల్లా కరాసవలస గ్రామంలోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)ను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా  కేజీబీవీ నిర్వహణ, ఆహారం, పరిసరాల పరిశుభ్రత, బాలికల భద్రత అంశాలను మంత్రి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, విద్యార్థినుల భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. విద్యార్థులు జాతీయ స్థాయిలో పోటీపడేలా విద్యా ప్రమాణాలు ఉండాలన్నారు.

===================

ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి
ప్రస్తుత వేసవిలో జిల్లాలో ఎక్కడా తాగునీటి ఎద్దడి లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి అన్నారు. ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు ఆయన అధ్యక్షతన జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం ఎంపీ శ్రీనివాసులురెడ్డి విలేకరులతో మాట్లాడుతూ, వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా పశ్చిమ ఒంగోలు ప్రాంతంలో నివసించేవారికి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ఎంపీ పేర్కొంటూ..

(వాయిస్ బైట్..32 సెకన్లు)- ఒంగోలు

===================

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తదుపరి 24 గంటల్లో మధ్య బంగాళాఖాతం మీదుగా కదులుతూ క్రమంగా బలహీనపడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ఫలితంగా రాష్ట్రంలో రేపు  తేలికపాటి నుండి ఒక  మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల  కురిసే అవకాశముందని తెలిపింది. ఉరుములతో కూడిన మెరుపులు బలమైన ఈదురు గాలులు గంటకు 40 -50 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలియజేశారు.

===================

===================